నేటి నుంచి జిల్లాస్థాయి సైన్స్‌ఫెయిర్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో మూడురోజుల పాటు నిర్వహించే జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌ను తిలకించేందుకు 6 నుంచి 10 తరగతుల విద్యార్థులను తీసుకురావాలని డీఈవో దక్షిణామూర్తి సోమవారం తెలిపారు. ఈ నెల 25న మధ్యాహ్నం మానుకోట, కురవి, సీరోలు, బయ్యారం, కేసముద్రం, ఇనుగుర్తి మండలాల విద్యార్థులను తీసుకు రావాలన్నారు. 26న ఉదయం గూడూరు, గంగారం, కొత్తగూడ, నెల్లికుదురు. చిన్నగూడూరు, నర్సింహులపేట, మధ్యాహ్నం తొర్రూరు, పెద్దవంగర, డోర్నకల్, గార్ల, 27న దంతాలపల్లి, మరిపెడ మండలాల విద్యార్థులను తీసుకురావాలని సూచించారు.



జంగిలిగొండలో గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

ప్రతీ ఒక్కరు గ్రంథాలయాలను వినియోగించుకోవాలి

మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు గ్రంథాలయాలను వినియోగించుకోవాలని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మానుకోట మండలం జంగిలిగొండ గ్రామంలో సోమవారం గ్రంథాలయాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ.. గ్రామాల్లో గ్రంథాలయాలు ఏర్పాటు చేయడం వల్ల యువతలో చైతన్యం, జ్ఞాన అభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. గ్రామాల్లో గ్రంథాలయాలు ఉండటం వల్ల యువత, విద్యార్థులు పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు ఎంతగానో దోహద పడతాయరన్నారు. కార్యక్రమంలో తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ రమిటీ రాష్ట్ర కో-కన్వీనర్ ఫైన శ్రీనివాస్, గ్రంథాలయ అధికారి విజేందర్, దేవరం ప్రకాష్‌రెడ్డి, మిట్టకంటి రాంరెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.



మహబూబాబాద్‌లో జిల్లా స్థాయి సైన్స్‌ఫెయిర్‌కు ముస్తాబు చేసిన మోడల్ స్కూల్

ఇన్‌స్పైర్.. చేసేద్దాం

నూతన ఆవిష్కరణల దిశగా.. భావి భారత శాస్త్రవేత్తలకు బాసటగా..

- నేటి నుంచి మానుకోటలో జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్
- 6 నుంచి 12వ తరగతి విద్యార్థులకు అవకాశం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులను భావిభారత శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు .. సైన్స్‌పై ఆసక్తిని పెంపొందిస్తూ ప్రయోగాల వైపు మళ్లించి నేటి బాలమేధావులే... రేపటి భావిశాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం ఇన్‌స్పైర్ మానక్ పోటీలు నిర్వహిస్తోంది. ప్రయోగాలు, వినూత్న ఆలోచనలు చేయడం, శాస్త్రవేత్తలుగా రాణించాలనుకునే విద్యార్థులకు ఇన్‌స్పైర్ మానక్ ఒక వరం. కేంద్రమానవ వనరుల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సంయుక్తంగా ఇన్‌స్పైర్ మానక్ అవార్డులను అందజేస్తుంది. ప్రతిభ చూపిన విద్యార్థికి న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో అభినందనలు, ఆతిథ్యంతో పాటు దేశంలో పేరుపొందిన శాస్త్రవేత్తలతో సమాలోచనలు పంచుకునే అవకాశం కల్పిస్తారు. వినూత్న ఆలోచనలతో దరఖాస్తు చేసుకొని జిల్లా, రాష్ట్రస్థాయి ఎగ్జిబిషన్‌లలో ఉత్తమ ప్రదర్శనగా ఎంపికై తరువాత జాతీయస్థాయి ప్రదర్శనలో పాల్గొనాల్సి ఉంటుంది. మానుకోట మోడల్ స్కూల్‌లో ఈనెల 25 నుంచి 27 వరకు జిల్లా స్థాయి సైన్స్‌ఫెయిర్ నిర్వహిస్తున్నారు. దీనికి అన్ని విద్యాశాఖ అధికారులు అన్నిఏర్పాట్లు పూర్తి చేశారు.



జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి దక్షిణామూర్తి

సైన్స్ విద్యార్థి ఆలోచనతో..

అటవీ జంతువుల బారి నుంచి వ్యవసాయ పంటలను కాపాడుకోవడానికి క్షేత్రం చుట్టు ఫినిషింగ్ ఏర్పాటు చేసి రిమోట్‌తో ఆపరేట్ చేస్తే ఫలితం ఉంటుందని సైన్స్ క్లాస్‌లో ఒక విద్యార్థి సూచించాడు. అతడిలో బాల మేధావి పురుడు పోసుకుంటున్నాడని గుర్తించిన ఉపాధ్యాయులు ఈ ఆలోచన 'ఇన్‌స్పైర్ ప్రోగ్రాంకు పంపించారు. ప్రభుత్వం సదరు ప్రతిపాదనను ఎంపిక చేసి రూ.10 వేలు నగదు అవార్డును అందించింది. దీంతో ఆ విద్యార్థి భావి శాస్త్రవేత్త తరహాలో జాతీయ స్థాయి పోటీలకు వెళ్లగలిగారు. ఇలాంటి చిన్నారుల చురుకైన

(మిగతా 8వ పేజీలో)



సృజనాత్మకతను వెలికితీసేందుకు...

ఉపాధ్యాయులు విద్యార్థుల ఆలోచనలకు మరింత మెరుగులు దిద్ది నాణ్యమైన సైన్స్ ప్రాజెక్టుల తయారికి ప్రోత్సాహం అందించాలి. సైన్స్ ఎగ్జిబిట్లను ప్రదర్శించటం వల్ల విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు దోహదం చేస్తుంది. జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు 99, సైన్స్ ఫెయిర్ పోటీలకు 230 ఎగ్జిబిట్లను ప్రదర్శించనున్నారు.

- బి. అప్పారావు, జిల్లా సైన్స్ అధికారి, మహబూబాబాద్



జడ్జి, కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ శబరీష్

జిల్లా ప్రధాన న్యాయమూర్తిని, కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ

మహబూబాబాద్ క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు నూతనంగా వచ్చిన ఎస్పీ శబరీష్ సోమవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి సెషన్స్ జడ్జి మహమ్మద్ అబ్దుల్ రఫీని, జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్‌ను సోమవారం వారివారి కార్యాలయాల్లో మొక్క అందజేసి మర్యాదపూర్వకంగా కలిశారు. నేర రహిత జిల్లాగా మార్చడంతోపాటు, ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని జడ్జి అన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో డీఎంహెచ్‌వో తనిఖీ

నెహ్రూసెంటర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రులను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి భూక్య రవిరాథోడ్ సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని వెన్నల ఆస్పత్రి, అమృత ఆస్పత్రి, అర్జున్ డయాగ్నస్టిక్ సెంటర్‌లను తనిఖీ చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. ఆస్పత్రిలో క్లీనికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ -2010 ప్రకారం.. ఆస్పత్రి నిర్వహణ ఉండాలని సూచించారు. ఆస్పత్రుల్లో కనీస ప్రమాణాలు ఉండాలన్నారు. సిబ్బంది అర్హతలు, రోగుల రికార్డుల నిర్వహణ, పరికరాల ప్రమాణాలు, వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలపై నిర్వాహకులకు స్పష్టమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు పాల్గొన్నారు.



మహబూబాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో రవిరాథోడ్



మహబూబాబాద్ వీసీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

చీరల పంపిణీలో ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేయాలి

రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

మహబూబాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీలో స్థానిక మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను భాగస్వాములు చేసి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచించారు. హైదరాబాద్ నుంచి డాక్టర్ బీఆర్. అంబేద్కర్ సచివాలయం నుంచి ఇందిరమ్మచీరల పంపిణీ , వడ్డీలేని రుణాలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు తదితర అంశాలపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా మహిళా సంఘాల ద్వారా అమలు చేస్తున్న వడ్డీలేని రుణాల పంపిణీ, ఇందిరా మహిళా శక్తి పెట్రోల్‌పంపు, ఆర్టీసీ బస్సు అద్దె నిర్వాహణ, అమ్మఆదర్శ పాఠశాలలో మౌళిక వసతుల కల్పన, యూనిఫామ్ స్టిచ్చింగ్, ఇందిరా మహిళాశక్తి క్యాంటిన్లు, ధాన్యం సేకరణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో మహిళా సంఘాలను భాగస్వాములను చేస్తూ ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీని నిర్వహించాలని చెప్పారు. రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తుందని అందులో భాగంగానే వడ్డీలేని రుణాలు అందిస్తుందన్నారు. ఈ వీసీలో జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అదనపు కలెక్టర్ కె.అనిల్‌కుమార్, జిల్లా అధికారులు మధుసూదనరాజు, స్వరూప, శ్రీనివాస్, శ్రీకాంత్, కవిత పాల్గొన్నారు. వీసీ అనంతరం జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సూచనల మేరకు మహిళలకు చీరల పంపిణీ, వడ్డీలేని రుణాల పంపిణీలో ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను భాగస్వాములను చేసి కార్యక్రమాలన్ని విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు.

రైల్వే మెగా డిపో తరలించడానికి కుట్రలు

- మానుకోట ఎంపీ, జిల్లా ఎమ్మెల్యేలు ఏం చేస్తున్నారు ?
- పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లలో బీసీలకు తీరని అన్యాయం
- ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

మహబూబాబాద్ టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు మంజూరైన రైల్వే మెగా మెయింటెనెన్స్ డిపో (పీవోహెచ్) తరలింపుకు కుట్రలు జరుగుతున్నాయని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. జిల్లాలోని ఎంపీ, ఎమ్మెల్యేలు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ రవీందర్‌రావు మాట్లాడుతూ...కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మహబూబాబాద్-ఇంటికన్నె రైల్వే స్టేషన్ల మధ్యలో ఏర్పాటు చేసేందుకు మెగా మెయింటెనెన్స్ డిపో ప్రాజెక్టు మంజూరైందని చెప్పారు. అందుకు సంబంధించిన రూ.908 కోట్ల నిధులు కూడా మంజూరు చేసిందని పేర్కొన్నారు. ప్రభుత్వ స్థలం గుర్తించి రైల్వే శాఖకు కేటాయిస్తే పనులు ఆరంభమవుతాయని, తద్వారా అనేక మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభించడమే కాకుండా ఈ ప్రాంతం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని వివరించారు. జిల్లాకు మంజూరైన రైల్వే మెగా మెయింటెనెన్స్ డిపోను వరంగల్ ఎంపీ కడియం కావ్య తన పార్లమెంటరీ పరిధిలోని నష్కల్ ప్రాంతానికి తరలించుకుపోయేందుకు ప్రయత్నిస్తున్నారని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు ఆరోపించారు. కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ మంజూరైందని దానికి స్థలం కేటాయించలేని వారు ఈ జిల్లాకు మంజూరైన మెగా రైల్వే మెయింటెనెన్స్ డిపోను తరలించుకుపోయేందుకు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయంపై రెండు రోజుల్లో స్పందించకుంటే అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలతో అఖిలపక్షాన్ని ఏర్పాటు చేసి కాంగ్రెస్ నేతలపై ఒత్తిడి తీసుకువస్తామని చెప్పారు. మానుకోటలో వందలాది ఎకరాల భూమి కబ్జాలకు గురవుతుందని, రైల్వే ప్రాజెక్టుకు భూమి ఇవ్వడానికి లేదా అని ప్రశ్నించారు. జిల్లా కేంద్రంలో మరో ఆర్వోబీ మంజూరయిందని దానిని కూడా నిర్మించి వాహనదారుల కష్టాలను తీర్చాలన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

పంచాయతీ రిజర్వేషన్‌లో బీసీలకు అన్యాయం..

జిల్లాలో త్వరలో జరగబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్ల కేటాయింపులో బీసీలకు తీరని అన్యాయం జరిగిందని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో 18 మండలాల పరిధిలో 482 గ్రామ పంచాయతీలుంటే కేవలం 30లోపే పంచాయతీలు బీసీలకు రిజర్వు అయ్యాయని చెప్పారు. బీసీలకు ఏ విధంగా 23 శాతం రిజర్వేషన్ ఇచ్చారని ప్రశ్నించారు. 42 శాతం ఇస్తామని చెప్పి కనీసం ఉన్న 23శాతం కూడ దక్కకుండా చేశారని వాపోయారు.

మండలాన్ని యూనిట్‌గా తీసుకుని పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో మునిసిపల్ మాజీ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, నాయకులు బానోత్ రవికుమార్, మంగలంపల్లి కన్న, జెరిపోతుల వెంకన్న, ఎడ్ల వేణు, కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, మార్నేని రఘు, డౌలాగర్ శంకర్, కర్పూరపు గోపి, శివ, వెంకటాద్రి లింగన్న పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

రైతులు, ప్రజలకు మెరుగైన సేవలందించాలి

కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మల్టీపర్పస్ ప్రాథమిక సహకారసొసైటీల ద్వారా రైతులకు, ప్రజలకు మెరుగైన సేవలందించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జిల్లా స్థాయి సహకార అభివృద్ధి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ మాట్లాడుతూ... జిల్లాలోని దంతాలపల్లి, పెద్దవంగర, కంబాలపల్లి, అప్పరాజుపల్లి, గంగారంలో నూతన సొసైటీల ఏర్పాటుకు చర్యలు తీసుకోవ డం జరుగుతుందన్నారు. రాష్ట్ర స్థాయి కమిటీ, ప్రభుత్వ నిబంధనల ప్రకారం మూడు సొసైటీలకు ఆమోదం తెలిపి ఒక సొసైటీ కోసం ప్రాథమిక సహకార సంఘ సభ్యుల కమిటీ ద్వారా క్షేత్ర స్థాయిలో సమీక్ష నిర్వహించాలని తెలిపారు. ఈ మల్టీపర్పస్ సహకార అభివృద్ధిసొసైటీల ద్వారారైతులకు ప్రజ లకు, యూరియా, ఫర్టిలైజర్స్ వ్యవసాయ తదితర సేవలు అందించడం జరుగుతుం దన్నారు. రైతులకు త్వరగా క్షేత్రస్థాయిలో ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ఉపయోగపడుతాయని తెలిపారు. మిగతా సొసైటీల ఎంపిక ప్రభుత్వం సూచించిన జాయింట్ కమిషన్ ద్వారా చర్యలు తీసుకుని ప్రతిపాదించాలన్నారు. అదనపు కలెక్టర్ కె.అనిల్‌కుమార్, జిల్లా అధికారులు వెంకటేశ్వర్లు, పురుషోత్తం, విజయనిర్మల, వజీర్ సుల్తాన్, కిరణ్‌కుమార్, శివప్రసాద్ పాల్గొన్నారు.

మార్కెట్‌కు రికార్డుస్థాయిలో ధాన్యం రాక

- 13వేల బస్తాల వడ్ల రాబడులు
- ఆర్‌ఎన్‌ఆర్ క్వింటాకు గరిష్ఠ ధర రూ.2789
- స్వల్పంగా తగ్గిన సగటు రేటు

కేసముద్రం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు ఈ సీజన్లోనే అత్యధికంగా సోమవారం 13వేల బస్తాల ధాన్యాన్ని రైతులు విక్రయించేందుకు తీసుకురావడం విశేషం. క్రితం రోజు శుక్రవారం మార్కెట్‌కు 6,598 బస్తాల ధాన్యం రాగా తాజాగా అంతకు రెట్టింపుగా 13,606 బస్తాల రాబడులు పెరిగాయి. మార్కెట్లోని మూడు కవర్‌షెడ్లు పూర్తిగా వడ్ల కుప్పలతో నిండి కార్యాలయం వెనుక, ముందు ప్రాంతంలోని ఓపెన్ యార్డు కూడా ధాన్యం రాశులతో కళకళలాడింది. మార్కెట్‌కు వచ్చిన సరుకులో జైశ్రీరాం రకం ధాన్యం 40 మంది రైతులు 1630 బస్తాలు, ఆర్‌ఎస్‌ఆర్ రకం 196 మంది 9292 బస్తాలు, హెచ్‌ఎంటీ రకం ధాన్యాన్ని 72 మంది 2684 బస్తాలు విక్రయించేందుకు తీసుకువచ్చారు. ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్ (ఈ-నామ్) విధానంలోని ఈ-వేలంలో జైశ్రీరాం రకం క్వింటాకు గరిష్ఠంగా రూ.2885, కనిష్ఠంగా రూ.2321, సగటున రూ.2829, ఆర్‌ఎస్‌ఆర్ రకం గరిష్ఠంగా రూ.2789, కనిష్ఠంగా రూ.2222, సగటున రూ.2545, హెచ్‌ఎంటీ రకం ధాన్యం క్వింటాకు గరిష్ఠంగా రూ.2579, కనిష్ఠంగా రూ.2289, సగటున రూ.2545 ధరల చొప్పున వ్యాపారులు ఖరీదులు చేశారు. శుక్రవారం నాటి మార్కెట్‌లో ఆర్‌ఎస్‌ఆర్ సగటు ధర రూ.2589 ఉండగా తాజాగా సప్లై పెరిగి క్వింటాకు రూ.50ల చొప్పున తగ్గి రూ.2545లకు చేరింది.



కేసముద్రం మార్కెట్‌కు సోమవారం విక్రయానికి వచ్చిన ధాన్యం రాశులు

ఆర్‌ఎన్‌ఆర్ గరిష్ఠ ధర మాత్రం రూ.2789 రావడం విశేషం. మార్కెట్‌కు తీసుకువచ్చిన 13,606 బస్తాల ధాన్యంలో 12,259 బస్తాలకే ఈ-నామ్‌లో వ్యాపారులు టెండర్లు వేయగా దాదాపు 1,340 బస్తాలకు ఈ-వేలంలో నాణ్యత, వివిధ కారణాలతో ధరలను ఎవరూ నమోదు చేయలేదు. కొంతమంది రైతులు తమ ధాన్యాన్ని తేమశాతం కోసం ఆరబెట్టుకోగా చాలా మంది రైతులు తమ సరుకును బయటకు తీసుకువెళ్లి వ్యాపారులకు ఏదో ఒక ధరకు విక్రయించుకున్నారు. ఉదయం గేట్ ఎంట్రీ (లాట్‌ఐడీ) స్లిప్‌లను ఇచ్చేందుకు మార్కెట్లో ఒకే ఒక్క కౌంటర్ పనిచేయడంతో రైతులు బారులు తీరారు. కొద్దిసేపటి తర్వాత మార్కెట్ అధికారులు మరో కౌంటర్‌ను తెరిచి లాట్ ఐడీ చీటీలను జారీ చేయించారు.



రెడ్యాల ఆశ్రమ పాఠశాలలో వంట శాలను పరిశీలిస్తున్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్‌నాయక్

పేద పిల్లలకు నాణ్యమైన విద్యనందించాలి

- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్‌నాయక్
- మరుగుదొడ్లు, వంటశాల అపరిశుభ్రతపై అసహనం

మహబూబాబాద్ రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : చదువు విజ్ఞానం కోసమేనని. పేద పిల్లలను దృష్టిలో ఉంచుకొని నాణ్యమై విద్యనందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్‌నాయక్ అన్నారు. మహబూబాబాద్ మండలం రెడ్యాల ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను సోమవారం జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్‌నాయక్ ఆకస్మికంగా సందర్శించి వంటశాల, మరుగుదొడ్లు, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ పేద గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు రుచికరమైన భోజనం అందించాలన్నారు. ఇకే గదిలో 30 మంది విద్యార్థులు నిద్రించటమేమిటని వార్డెన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వంట గది, డైనింగ్ హాల్ అపరిశుభ్రంగా ఉండడంపై మండిపడ్డారు. గతంలో 12వ తరగతి కొనసా గుతుండగా ఆ తరగతులను మానుకోట జిల్లా కేంద్రానికి తరలించారని గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో ఐటీడీఏ పీవో తో ఫోన్‌లో మాట్లాడి తిరిగి రెడ్యాల ఆశ్రమ పాఠశాలలోని 12వతరగతి ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట డీడీ దేశీరాంనా యక్, ఇన్‌చార్జి హెచ్‌ఎం వెంకన్న, పీడీ మోహన్‌నాయక్, వార్డెన్ దేవ్లా, పీఈటీ ఇస్మాయిల్, గ్రామస్థులు ఉన్నారు.

48జీపీల్లో బీసీలకు ఒక్కటి కూడా కేటాయించలే



మాట్లాడుతున్న దిగిజర్ల ముఖేశ్

మరిపెడ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 48 జీపీలకు ఏ ఒక్క జీపీని బీసీలకు కేటాయించకపోవడం బీసీల పట్ల కాంగ్రెస్ పార్టీ కపట విధానం ఏమిటో తేలిపోయిందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం మరిపెడ మండల అధ్య క్షుడు దిగిజర్ల ముఖేశ్ మండి పడ్డారు. సోమవారం ఆయన మరిపెడ విశ్రాంతి భవన్‌లో ఆ సంఘం స్థానిక నేతలతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. 100శాతం ఎస్టీ జనాభా ఉన్న తండాల జీపీలను మినయిస్తే మిగిలిన జీపీలలో బీసీ ఓటర్లు మెజార్టీ సంఖ్యలో ఉన్నప్పటికి బీసీలకు రిజర్వేష న్లు వర్తింప చేయలేదని విమర్శిం చారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ రాజ్యాంగ స్ఫూర్తితో 27శాతం బీసీలకు చెందాల్సిన బీసీ రిజర్వేషన్లను వర్తింప చేయాలన్నా రు. లేనిట్లైయితే కాంగ్రెస్ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తదన్నా రు. ఈ సమావేశంలో గంధసిరి కృష్ణ, రాంపెల్లి రవి, రేఖ వెంకన్న, దిగిజర్ల శ్రీనివాస్, బోడపట్ల సతీశ్, రేఖ దర్గయ్య తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో ఇందిర మహిళా శక్తి చీరల పంపిణీ

పెద్దవంగర, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో సోమవారం ఇందిరా మహిళా శక్తి చీరలను పంపిణీ చేసినట్లు ఏపీఎం ఎమ్డీ.మహబూబ్ పాషా, పెద్దవంగర గ్రామ ప్రత్యేకాధికారి బుధారపు శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో ఏపీఎం మాట్లాడుతూ మండలంలో 28గ్రామ ఐక్య సంఘాల్లో మొత్తం 7,216 మంది మహిళల సభ్యులను ఐరీష్ యాప్ ద్వారా చీరలను పంపిణీ చేశామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలన్నారు. ఆయా గ్రామాల్లోని ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, మహిళ సంఘం సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

● తొర్రూరు రూరల్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం ఇందిరా మహిళ శక్తి చీరలను పంపిణీచేశామని ఏపీఎం సునీత అన్నారు. మండలంలోని గ్రామాల్లో 44 వివోఏ మహిళ సంఘాలకు మొత్తం 11,620 మంది మహిళలకు కొత్త మార్గదర్శకాలను అనుసరిస్తూ మహిళలకు చీరెలను పంపిణీ చేశారు. ప్రభుత్వం అందింస్తున్న సంక్షేమపథకాలను వినియోగించుకోవాలన్నారు.

వీరారంలో చేప పిల్లల పంపిణీ

మరిపెడ రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నాణ్యమైన చేప పిల్లలను పంపిణీ చేసినట్లు ముదిరాజ్ మహాసభ రాష్ట ఉపాధ్యక్షుడు గొడుగు శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని వీరారంలో ఉన్న వీర సముద్రం లో చేప పిల్లలనుపోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వీరసముద్రం చెరువులో 96వేల చేప పిల్లలను పోయాల్సి ఉండగా బొచ్చెలు 211 కేజీలు, శీలావతి 191కేజీల చేప పిల్లలు పోశామన్నారు. అయితే గతంలో జిల్లాలోనే అనేక చెరువులలో నాసిరకమైన చేప పిల్లలు పంపిణీ చేసిందని, వెంటనే మత్స్యశాఖ మంత్రి, జిల్లా కలెక్టర్‌కు విన్నవించకొగా వారు వెంటనే స్పందించి నాణ్యమైన చేప పిల్లలను పంపిణీ చేసిందన్నారు. అందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దుస్స నర్సయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

దీపం అంటుకొని సామగ్రి దగ్ధం

రూ.1లక్ష ఆస్తినష్టం

తొర్రూరు రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ఓ ఇంట్లో దేవుడికి ఏర్పాటు చేసిన దీపం అంటుకొని ఇంట్లోని సామగ్రి దగ్ధమైన సంఘటన మండలంలోని అమ్మాపురం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు, బాధిరాలు తెలిపిన వివరాల ప్రకారం..అమ్మాపురం గ్రామంలోని బేడ బుడుగ జంగాల కాలనీకి చెందిన కడెం మల్లికంబ రోజువారీగా దేవుడికి దీపం వెలిగించింది. పనుల నిమిత్తం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లి వచ్చి చూడగా ప్రమాదవశాత్తు దేవుడికి ఏర్పాటు చేసిన దీపం అంటుకొని ఒక్కసారిగా మంటలు చేలరేగి ఇంట్లోని సామగ్రి దగ్ధమైనట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో నగదు, దుస్తులు, కాగితాలు, బియ్యం, వంటి సామగ్రి దగ్ధమైనట్లు తెలిపారు. సుమారు రూ.1లక్ష ఆస్తినష్టం జరిగినట్లు బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబ సభ్యులను ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

రైతులు దళారుల చేతిలో మోసపోవద్దు

● ప్రభుత్వ విప్ రాంచంద్రు నాయక్

నర్సింహులపేట (మహబూబాబాద్ క్రైం), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధరతో పాటు బోనస్‌ను పొందాలని డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వం విప్ జాటోతు రాంచంద్రునాయక్ అన్నారు. నర్సింహులపేట మండల కేంద్రంతో పాటు పెద్దనాగారం వస్రాంతండాలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు మద్దతు ధర కల్పించేందుకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం స్థానిక రైతు వేదికలో ప్రభుత్వం సరఫరా చేసిన ఇందిరా మహిళా శక్తి చీరలను డ్వాక్రా మహిళలకు పంపిణీ చేశారు. నర్సింహులపేట మండలంలో 7,086 మంది మహిళలకు ఇందిరా మహిళా శక్తి చీరలు అందనున్నట్లు తెలిపారు. వచ్చే ఐదేళ్లలో డ్వాక్రా మహిళలను కోటీశ్వరులను చేయడమే సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమేశ్‌బాబు, ఎంపీడీవో అంజలి, పీఏసీఎస్ చైర్మన్ సంపెట రాముగౌడ్, వైస్ చైర్మన్ బొబ్బ సంజీవరెడ్డి, దేవస్థానం చైర్మన్ జైపాల్‌రెడ్డి, మరిపెడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దాసరోజు రాజశేఖర్, మండల పార్టీ అధ్యక్షుడు జినుకల రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి బొబ్బ సోమిరెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు రామకృష్ణ, మహబూబ్‌ఖాన్, డైరెక్టర్లు రజినీకాంత్‌రెడ్డి, సైదులు, అలువాల శ్రీనివాస్, ఉప్పలయ్య, పార్టీ శ్రేణులు, అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి..

తెలంగాణ మలిదశ ఉద్యమ కారుల సమస్యలు పరిష్కరించి, ఆర్థికంగా ఆదుకోవాలని కోరుతూ తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం నర్సింహులపేటలో ఎమ్మెల్యే డాక్టర్



నర్సింహులపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ జాటోతు రాంచంద్రు నాయక్

రాంచంద్రునాయక్‌కు వినతి పత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సీఎం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్యసలహాదారులు సమ్మెట సమ్మయ్య, మండల అధ్యక్షుడు బానోతు లాలు, బొమ్మగాని వెంకన్న, సాయిక్రిష్ణ, దూరు శ్రీపాల్, ఓర్సు సోమయ్య, అంబరీష, రమేశ్, నర్సయ్య ఉన్నారు.

తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చిన కేసీఆర్

దంతాలపల్లి (ఆంధ్రజ్యోతి): గత కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చారని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచంద్రునాయక్ అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో ఇందిర మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం పదేళ్లలో తెలంగాణ రాష్ట్రంను తీవ్రంగా నష్టపరిచిందన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం ఎన్నో పథకాలను అమలు చేస్తున్నారన్నారు. డోర్నకల్ నియోజక వర్గంలో మహిళలకు రూ.54కోట్లు, దంతాలపల్లి మండలానికి 3.34కోట్లు వడ్డీలేని రుణాలను మంజూరు చేశామన్నారు. ధాన్యాన్ని నేరుగా రైతులు కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలన్నారు. డోర్నకల్ నియోజక వర్గంను కంటికి రెప్పలా కాపాడుతానన్నారు. ఈ కార్యక్రమంలో, ఏఎమ్సీ వైస్ చైర్మన్ భట్టునాయక్, పీఏసీఎస్ చైర్మన్ రాముగౌడ్, ఐకేపీ ఏపీఎం నవీవరావు, సీసీ బీముడు, తాజామాజీ ఎంపీటీసీ యాకన్న నాయకులు కొమురెల్లి తదితరులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

మరిపెడ (ఆంధ్రజ్యోతి) : మహిళల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. సోమవారం మరిపెడ మున్సిపల్ కేంద్రంలోని ఆడిటోరియంకం ఇండోర్ స్టేడియం, చిన్నగూడూరులో జీపీ భవన్ దగ్గర ఇందిరా శక్తి పథకం కింద మహిళలకు చీరెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇందిరా శక్తి పథకం వర్తింప చేసి రాష్ట్రంలోని కోటి మంది మహిళలకు చీరెలు పంపిణీ చేసే కార్యక్రమం చేపట్టామన్నారు. డ్వాక్రా రుణాలు, శ్రీనిధి రుణాలను ఇందిరమ్మ ఇళ్ల పథకానికి వర్తింప చేస్తున్నామన్నారు. అదే విధంగా చిన్నగూడూరు మండలంలోని చిన్నగూడూరు, జయ్యారం, గుండంరాజుపల్లి, ఉగ్గంపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్, మరిపెడ పీఏసీఎస్ చైర్మన్ యాదగిరిరెడ్డి, మాజీచైర్మన్ రాంరెడ్డి, గునిగంటి కమలాకర్, మరిపెడ మండల స్పెషల్ ఆఫీసర్ కిరణ్‌కుమార్, మరిపెడ, చిన్నగూడూరు తహసీల్దార్లు కృష్ణవేని, సంపత్, ఎంపీడీవోలు వేణుగోపాల్‌రెడ్డి, సుజాత, ఎంపీవోలు, ఐకేపీ ఏపీవోలు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఆక్రమించి నిరసన

● కన్నెత్తి చూడని పోలీసులు, రెవెన్యూ అధికారులు

తొర్రూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో నిర్మించి ఉన్న 280 డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ చేపట్టాలని కోరుతూ సీపీఎం, దరఖాస్తుదారులు గత 7 నెలలుగా దీక్షలు, రాస్తారోకోలు, ధర్నాలు, ప్రజా ప్రతినిధులకు వినతి తదితర కార్యక్రమాలు చేపట్టినా ప్రభుత్వం సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో సోమవారం సామగ్రితో, పిల్లపాపలతో ఇళ్లను ఆక్రమించి నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం మండల కార్యదర్శి ఎమ్డీ.యాకూబ్ మాట్లాడుతూ గత 7 నెలలుగా వివిధ రకాలుగా నిరస నలు తెలిపినా పట్టించుకోకపోవడంతో దరఖాస్తుదారులు ఆక్రమించారని తెలిపారు. గత ప్రభుత్వం సుమారు రూ.20కోట్లతో నిర్మించిన ఇళ్లను దరఖాస్తుదారులు ఆక్రమించడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతుందన్నారు. అర్హులైనవారికి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి



డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద దరఖాస్తుదారులు

రాగానే ఇళ్ల పంపిణీ చేస్తామని హామీ ఇచ్చి విస్మరించిందన్నారు. దీంతో ఇండ్లు ఆక్రమించిన వారిలో అర్హులను గుర్తించి ఇళ్లపంపిణీ చేపట్టాలని పలువురు కోరుతున్నారు. కాగా, తహసీల్దార్ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు సీపీఎం నాయకులపై, ఆక్రమించిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం

పెద్దవంగర, నవంబర్ 24 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకొని సత్తాచాటాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య అన్నారు. సోమవారం మండలంలోని పోచంపల్లి, రెడ్డికుంటతండా, జయిరామ్‌తండా, పడమటితండా, బొమ్మకల్ గ్రామాల్లో బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సంక్షేమ పథకాల కోతలు, ఎగవేతలు తప్ప ప్రజలకు చేసింది శూన్యమన్నారు. అధికారంలోకి వచ్చేందుకు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అటకెక్కాయని, 420 హామీలు గాలిలో కలిశాయని, ఆ పార్టీపై ప్రజలకు విశ్వాసం పోయిందని మండిపడ్డారు. కాంగ్రెస్ రాగానే కరువు, యూరియా కష్టాలు మళ్లీ మొదలైనట్లు వివరించారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చేపట్టానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీరాం సుధీర్, శ్రీరాం సంజయ్, కనుకుంట్ల వెంకన్న, రఘు, సమ్మయ్య, దయాకర్, రాంమూర్తి, గంగాధర్, సీతారామ్‌నాయక్ పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

తొర్రూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : అనుమతి లేకుండా తరలిస్తున్న 3 ఇసుక ట్రాక్టర్‌లను పట్టుకున్నట్లు తహసీల్దార్ జి. శ్రీనివాస్ తెలిపారు. సోమ వారం మండలంలోని మడిపెల్లి గ్రామ శివారు ఆకేరు వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా తొర్రూరుకు తరలిస్తుండగా సమాచారం మేరకు పట్టణంలో ట్రాక్టర్‌లను సీజ్ చేసి కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు. మండలంలోని సోమారంకుంట తండా, మడిపెల్లి గ్రామాలకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్‌లకు రూ.15వేల జరిమానా విధించామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పేరిట ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పవన్నారు.

నూతన ఫీల్డ్‌అసిస్టెంట్ మండల కమిటీ ఎన్నిక

దంతాలపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : దంతాలపల్లి మండల నూతన ఫీల్డ్‌అసిస్టెంట్ కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ మార్క వెంకన్నగౌడ్‌ను అధ్యక్షుడిగా, గున్నేపల్లి గ్రామానికి చెందిన బండారు విజయను ఉపాధ్యక్షురాలుగా, వేములపల్లి గ్రామానికి చెందిన కొమ్ము నాగయ్యను ప్రధానకార్యదర్శిగా, కుమ్మరికుంట్ల గ్రామానికి చెందిన ధర్మారపు వెంకన్నను కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు. మండల గౌరవ సలహాదారులుగా బొడ్లాడ గ్రామానికి చెందిన ఎర్రం శంకర్, బీరిశెట్టి గూడెంకు చెందిన మిడ్తపల్లి జగన్, కార్యవర్గ సభ్యులుగా రేపోణి సహదేవ్, ధర్మారపు సత్తయ్య, దాట్ల మల్లయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



వెంకన్నగౌడ్

రెండు ఇళ్లలో చోరీ

● రూ.1.12లక్షల సొత్తు అపహరణ

కేసముద్రం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం మునిసిపాలిటీ పరిధిలోని అమినాపురంలో ఆదివారం రాత్రి రెండు ఇళ్లలో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి రూ.1.12లక్షల సొత్తును ఎత్తుకెళ్లినట్లు ఎస్ఐ కె.కాంత్రికిరణ్ సోమవారం తెలిపారు. రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డులో బట్టు సుధాకర్ ఆదివారం తన ఇంటికి తాళం వేసి బ్రాహ్మణపల్లిలోని అత్తగారి ఇంటికి వెళ్లాడు. రాత్రి దొంగలు ఇంటిముందు తాళం పగులగొట్టి బీరువాలోని రూ.90వేల విలువైన తులం బంగారు గొలుసు, అరతులం చొప్పున రెండు ఉంగరాలు, 30 తులాల వెండి పట్టీలను ఎత్తుకెళ్లారు. సమీపంలోని వెల్పుగొండ ఏలియా ఇంటికి తాళం వేసి పక్కింట్లో నిద్రించగా ఆయన ఇంటి తాళం పగులగొట్టి రూ.12వేల విలువైన బంగారు పుస్తెలు, రూ.10వేల నగదును అపహరించారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఘటన స్థలాలను కేసముద్రం సీఐ వై.సత్యనారాయణ పరిశీలించగా మహబూబాబాద్ నుంచి క్లూస్ టీం వచ్చి ఆధారాలను సేకరించారు.

డోర్నకల్‌లో..

డోర్నకల్: డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలోని కుందోజు వారీ వీధిలో



ఆధారాలను సేకరిస్తున్న క్లూస్ టీం, పరిశీలిస్తున్న సీఐ సత్యనారాయణ

గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన షేక్ అప్జల్ కుటుంబ సభ్యులతో కలిసి నాలుగు రోజుల క్రితం హైదరాబాద్ వెళ్లారు. ఇంట్లో ఎవరు లేకపోవడంతో ఇదే అదునుగా భావించిన దుండగులు ఇంటికి వేసిన తాళం పగులగొట్టి బీరువాను తెరిచి అందులో ఉన్న రూ.50 వేల నగదుతో పాటు వెండి, బంగారు ఆభరణాలు అపహరించుకుపోయినట్లు చెప్పారు. చుట్టుపక్కల వారు ఇంటి తాళం పగులగొట్టి తలుపు తెరిచి ఉండడం గమనించి అప్జల్‌కు సమాచారం అందించారు. చోరీ జరిగిన ఇంటిని డోర్నకల్ ఎస్సై ఉమ, సిబ్బందితో కలిసి పరిశీలించారు. క్లూజ్‌టీంను ఘటన స్థలానికి రప్పించి వివరాలు సేకరించనున్నట్లు చెప్పారు.

విద్యుత్‌లైన్ తొలగించాలని వినతి

నెలరోజులైనా పట్టించుకోని విద్యుత్ అధికారులు

తొర్రూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడంతో ఇల్లు నిర్మించుకునేందుకు సిద్ధమైన ఓ కుటుంబానికి ఇబ్బందులు ఏర్పడిన సంఘటన చోటు చేసుకుంది. తొర్రూరు పట్టణానికిచెందిన పైండ్ల రాజమ్మకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. ఇంటి పై స్థలం నుండి విద్యుత్ తీగలు వెళుతుండడంతో సంబంధిత విద్యుత్ అధికారులకు లేఖ ద్వారా ఫిర్యాదు చేశారు. విద్యుత్ అధికారులు తొలగించాలంటే చలానా ద్వారా రూ 25,595 చెల్లించాలని చెప్పారు. ఈ విషయాన్ని గత నెల 28న విద్యుత్ సీఎండీ కార్యాలయంలో ఫిర్యాదు చేయగా తొర్రూరు విద్యుత్ డివిజనల్ ఇంజనీర్ కార్యాలయంలో అధికారులకు తెలుపాలని సూచించారు. కార్యాలయంలో డీఈ రవిని సంప్రది ంచగా చలానా ద్వారా చెల్లించాల్సిందేనని తేల్చి చెప్పాడు. తనకు చలానా చెల్లించే స్తోమత లేదని, విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వం మంజూరు చేసిన ఇల్లు నిర్మించుకోకుండా ఆగిపోయిందని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తన సమస్య పరిష్కరించాలని రాజమ్మ కోరుతున్నారు.



ఇంటి స్థలం పై నుంచి వెళుతున్న విద్యుత్ తీగలు

గీతన్నల రణభేరిని జయప్రదం చేయాలి




గీతన్నల రణభేరీ వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న గౌని వెంకన్న

మహబూబాబాద్ టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేటలో కల్లుగీత కార్మిక సంఘం (కేజీకేఎస్) రాష్ట మహాసభలను పురస్కరించుకుని ఈనెల 28న జరుపతలపెట్టిన గీతన్నల రణభేరికి వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గౌని వెంకన్న పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు అనంతారం, జమాండ్లపల్లి, జంగిలిగొండ, వీఎస్. లక్ష్మీపురం, మాధాపురం గ్రామాల్లో సోమవారం గీతన్నల రణభేరి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గౌని వెంకన్న మాట్లాడుతూ....ఈ నెల 29, 30 తేదీల్లో సూర్యపేటలో కేజీకేఎస్ రాష్ట్రమహాసభలు జరుగుతాయని దాని సందర్భంగా 28న గీతన్నల రణభేరి పేరుతో బహిరంగ సభను ఏర్పాటు చేశామని దానికి గీత కార్మికులు పెద్ద ఎత్తున తరలి వచ్చి సత్తాచాటాలని కోరారు. రాష్ట్ర మహాసభలో గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి, హక్కుల సాధన కోసం భవిష్యత్ కార్యాచరణను రూపొందించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకన్న,సైదులు, బూర్ల ప్రభాకర్, జగన్నాధం, మల్లయ్య, సురేష్, రమేష్, సోమయ్య, నారాయణ, యాకయ్య, కృష్ణ, రాములు, ఉపేందర్, నరేష్, వెంకటాద్రి, ప్రసాద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే మహిళల ఆర్థికాభివృద్ధి

మానుకోట ఎమ్మెల్యే మురళీనాయక్



ఇందిరమ్మ చీరెలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

కేసముద్రం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. కేసముద్రం రైతువేదికలో సోమవారం మహిళలకు ఇందిరమ్మ చీరలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మహిళా సంఘాలకు పథకాలను తొలగించారని, కాంగ్రెస్ ప్రభుత్వంలో మహాలక్ష్మీ పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకే గ్యాస్, ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. మహిళా సంఘాలకు ఆర్థిక చేయూతనిస్తూ కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, బండారు వెంకన్న, గుగులోత్ దస్రూనాయక్, రావుల మురళి, డీటీ ఎర్రయ్య, ఎంపీడీవో క్రాంతి, ఎంఈవో బి.వెంకన్న పాల్గొన్నారు.

మానుకోట మార్కెట్ కళకళ

మహబూబాబాద్ అగ్రికల్చర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం వచ్చిన దాన్యం రాశులతో కళ...కళ లాడింది. సన్నాలకు సంబంధించిన దాన్యమే అత్యధికంగా వచ్చింది. జై శ్రీరాం, ఆర్ఎన్ఆర్, హెచ్ఎంటీ, సాంబ మసూరి రకాలు, 5022 సంచులు మార్కెట్‌కు వచ్చాయి. జై శ్రీరాం రకం గరిష్టంగా క్వింటాకు రూ. 2800 దర పలకగా, కనిష్టంగా రూ. 1910, ఆర్ఎన్ఆర్ రకం క్వింటాకు గరిష్టంగా రూ. 2560, కనిష్టంగా రూ. 1930 పలికింది, సాంబ మసూరి క్వింటాకు రూ. 2560, కనిష్టంగా రూ. 2120 పలికింది. హెచ్ఎంటీ రకం క్వింటాకు గరిష్టంగా రూ. 2719, కనిష్టంగా రూ. 1880 పలికింది. అంతే కాకుండా మొక్కజొన్న క్వింటాకు గరిష్టంగా రూ. 1901, కనిష్టంగా రూ. 1576 పలుకగా పత్తి క్వింటాకు గరిష్ట ధర 6926, కనిష్ట ధర 4337 పలికింది.



మహబూబాబాద్ మార్కెట్‌కు వచ్చిన ధాన్యం రాశులు

సమయపాలన పాటించని అధికారులు

తొర్రూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ప్రజలకు పాలన చేరువయ్యేందుకు చిన్న జిల్లాలతో పాటు, రెవెన్యూ డివిజన్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. కానీ అధికారుల నిర్లక్ష్యంతో ప్రజల సమస్యలను పట్టించుకునేందుకు అధికారులు అందుబాటులో ఉండటం లేదు. సోమవారం ఉదయం 11 గంటల వరకు కూడా ఆర్డీవో కార్యాలయానికి అధికారులు పూర్తి స్థాయిలో రాకపోవడంతో తొర్రూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని వివిధ మండలాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. 11 గంటల వరకు కూడా కింది స్థాయి సిబ్బంది తప్ప ఏ ఒక్క అధికారి కూడా హాజరు కాకపోవడంతో కార్యాలయంలో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. దీనిపై సిబ్బందిని అడగగా ఆర్డీవో ఇతర మండలాలకు వెళ్లినట్లు తెలిపారు. ఇతర అధికారులు ఫీల్డ్ విజిట్ పేరుతో కార్యాలయాలకు హాజరుకాకుండా ఇష్టానుసారంగా వ్యవహ రిస్తున్నారని ఆరోపిస్తున్నారు.



ఖాళీగా ఉన్న ఆర్డీవో కార్యాలయం



బాస్కెట్‌బాల్ ఎంపికలపై తోటబడి వద్ద నిర్వాహకులతో క్రీడాకారుల వాగ్వాదం దృశ్యం

బాస్కెట్‌బాల్ ఎంపికల్లో గందరగోళం

- అనుమతులు లేకుండా ఎంపిక ప్రక్రియ
- తోట బడి వద్ద పలువురి ఆందోళన
- నిర్వాహకులతో వాగ్వాదం.. పోలీసుల రంగప్రవేశం

హనుమకొండ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా బాస్కెట్‌బాల్ ఎంపిక ప్రక్రియ జరుపుతున్నారంటూ పలువురు క్రీడాకారులు ఆందోళనకు దిగడంతో హనుమకొండ సెయింట్ జోసఫ్(తోటబడి) వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు రంగప్రవేశం చేసి పరిస్థితిని చక్కదిద్దారు. వివరాల్లోకి వెళితే..

రెండు బాస్కెట్ బాల్ అసోసియేషన్ల మధ్య కొంతకాలంగా వివాదం కొనసాగుతోంది. పంచాయతీ కోర్టు వరకు వెళ్లింది. ఈ క్రమంలో గుర్తింపు లేనిదిగా చెబుతున్న అసోసియేషన్ బాస్కెట్‌బాల్ ఎంపికలను చేపట్టింది. మొదట హనుమకొండలోని జేఎన్ఎస్ స్టేడియంలో ఈ ఎంపిక పోటీలను నిర్వహించాలని భావించినప్పటికీ వివాదం నేపథ్యంలో డీఎస్‌వో అనుమతి ఇవ్వకపోవడంతో వేదికను హనుమకొండలోని తోట బడికి మార్చారు. సోమవారం ఎంపిక పోటీలు జరగనుండగా అక్కడికి వచ్చిన కొందరు ఆటగాళ్లు దీనికి అడ్డుకునే ప్రయత్నం చేశారు. నకిలీ పత్రాలతో సెలక్షన్ కమిటీ పేరిట ఆటగాళ్ల భవిష్యత్తును దెబ్బతీసే విధంగా వ్యవహరించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిటీ సభ్యులతో వాగ్వాదానికి దిగారు. బాస్కెట్ బాల్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న వ్యక్తి ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధిగా కూడా కొనసాగుతూ ఇలాంటి కార్యక్రమాలు చేయడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. నిజానిజాలు తేలే వరకు ఈ సెలక్షన్సను తాత్కాలికంగా నిలిపివేయాలని డిమాండ్ చేశారు. దీనితో నిర్వాహకులకు, ఆటగాళ్లకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకొని పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని ఇరువర్గాలను పోలీసుస్టేషన్‌కు తరలించారు. అయితే ఎలాంటి విచారణ చేపట్టకుండానే ఇరువురిని కాకుండా సాగర్ అనే ఆటగాడిని పోలీసు స్టేషన్‌లో నిర్బంధించి మిగతా వారిని పోలీసులు బయటకు పంపించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఏకభుక్తం.. భూతల శయనం..

- అనుక్షణం అయ్యప్ప నామస్మరణం
- భక్తిభావంలో ఓలలాడుతున్న భక్తులు
- జిల్లాలో మార్మోగుతున్న అయ్యప్ప శరణుఘోష



జనగామలోని అయ్యప్ప ఆలయంలో పడిపూజలో పాల్గొన్న భక్తులు



అయ్యప్ప మాల వేస్తున్న గురుస్వామి రాజేశ్వరాచార్యులు

లింగాలఘణపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్ప నామస్మరణతో పల్లె, పట్టణాలు మార్మోగుతున్నాయి. అయ్యప్ప మాలదారులు భక్తిశ్రద్ధలతో నిష్టతో దీక్షను కొనసాగిస్తున్నారు. ఎముకలు కొరికే చలిలో కఠోర దీక్షలకు సిద్ధమైన అయ్యప్ప భక్తులు భక్తిభావంతో ముందుకు సాగుతున్నారు. ఒంటిపూట మాత్రమే సాత్వికంగా భోజనం చేస్తూ, నేలపై శయనిస్తూ మాలదారులు మండల పూజలు చేస్తున్నారు. దీక్ష స్వీకరించిన వారు మండల కాలం(41 రోజులు) కఠోర దీక్షతో స్వామిని కొలుస్తుంటారు. ఒక్కపూట శాఖాహారంతో మాత్రమే భోజనాన్ని స్వీకరిస్తూ, ఆహార నియమాలను పాటిస్తున్నారు. మధ్యాహ్నం భోజనం తర్వాత తిరిగి ఎలాంటి ఆహారం తీసుకోకుండా మళ్లీ రాత్రి పడుకునే ముందు పాలు, పండ్లు లేక సాత్వికమైన అల్పాహారం తీసుకుంటూ నిత్యం ఆధ్యాత్మిక చింతనలో మునిగి తేలుతున్నారు. కామోత్రేరకాలను కలిగించే అల్లం వెల్లుల్లి లాంటి వాటిని పూర్తిగా దూరంగా ఉంచడం విశేషం. వేకువ జామునే లేచి చన్నీటి శిరస్నానం చేసి బ్రహ్మముహూర్తంలో స్వామి వారికి పూజలు చేస్తున్నారు. ఎదురుగా వచ్చే ఎవ్వరినైనా వారి పేర్లతో కాకుండా అయ్యప్పస్వామి పేరుతో పలకరిస్తూ అనుక్షణం అయ్యప్ప నామస్మరణం చేస్తుంటారు.

యోగాసనం.. పూజా విధానం..

అయ్యప్ప దీక్ష తీసుకున్న ప్రతీ భక్తుడు తనకు తెలియకుండానే ప్రతీరోజు ఉదయం సాయంత్రం యోగాసనం చేస్తుంటారు. అయ్యప్ప స్వామి పూజను మొదలు చేసినప్పటి నుంచి తను చేసే ప్రతీ కదలిక శరీరంలోని ప్రతీ భాగం యోగాసనం చేస్తుంది. పూజ క్రతువులో చేతులు, చేతి వేళ్ల నిర్విరామంగా క్రమపద్ధతిలో పనిచేయడం, రెండు కాళ్లను ముడుచుకుని కూర్చోవడం, అంగపూజ చేస్తున్నప్పుడు పుష్పార్చన చేయడం, అష్టోత్తర శతనామావళి చేస్తున్నప్పుడు అక్షింతలు వేయడం లాంటివి యోగాసనంలో భాగమే అవుతుంటాయి. అదేవిధంగా నమస్కారం శ్లోకం పఠిస్తున్న సమయంలో నిటారుగా నిల్చుని తిరిగి నడుము ను కిందికి వంచడం, భూమాతకు వంద నం చేయడం, సాష్టాంగ ప్రణామం చేస్తున్నప్పుడు మోకాళ్ల నేలకు ఆనకుండా కాలి బొటన వేళ్ల సాయంతో బోర్లాపడుకుని స్వామిని ప్రార్థించడం లాంటి చర్యలు యోగాసనంలో భాగంగా మారిపోతాయి.



ఆలయంలో పడిని వెలిగిస్తున్న అయ్యప్ప భక్తులు

ఉదయాన్నే పూజ ముగిసిన అనంతరం సమీప దేవాలయంలో ప్రదక్షణలు చేస్తుండటం కూడా మార్నింగ్ వాక్‌గా ఉపకరిస్తుంది. అన్నింటి కంటే ప్రధానమైన అంశం 108 సార్లు అత్యంత భక్తి శ్రద్ధలతో ఘోషించే శరణు ఘోష శ్వాసను నిలువరిస్తూ శరీరాన్ని, మనసును పూర్తిగా తమ ఆధీనంలోకి తెచ్చుకోవడం కూడా యోగాసనంలో భాగంగానే మారిపోతాయి.

మహిళలపై మాతృభావం..

అయ్యప్ప దీక్షలో ప్రధానంగా ప్రతీ మహిళను తల్లి సమానంగా భావిస్తారు. భార్యను సైతం మండలకాలం పాటు 41 రోజులు మాతృమూర్తిగా భావించి మాతాస్వామిగా పలకరిస్తూ అయ్యప్పస్వామిని కొలుస్తుంటారు. దీక్ష స్వీకరణ చేసిన ప్రతీ భక్తుడు తనలో అహాన్ని విడిచి తనతోటి వారంతా తనతో సమానమనే భావనను కలిగి ఉండటంతో పాటు పూజా కార్యక్రమాలు ముగిసిన తర్వాత పెద్ద చిన్నా, ధనిక పేద తారతమ్యం లేకుండా ప్రతీ ఒక్కరివి పాదపూజ(కాళ్లమొక్కడం)చేసుకోవడం సమానత్వానికి అయ్యప్ప దీక్షా నియమాలు ప్రతీకగా నిలుస్తున్నాయి.



బాణాపురంలో కలశ పూజలు చేస్తున్న అర్చకుడు

5వేల మంది మాలదారులు

కాసోజు రాజేశ్వరాచార్యులు, ప్రధానార్చకులు, అయ్యప్ప దేవాలయం(బాణాపురం) జనగామ



జనగామ జిల్లా వ్యాప్తంగా సుమారు 5వేల పైచిలుకు మంది అయ్యప్ప దీక్షను స్వీకరించారు. గతంతో పోల్చితే భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఉరుకుల పరుగుల జీవితాలతో బతుకుపోరాటంతో నిత్యం కుస్తీపడుతున్న ఎంతో మంది మండలకాలం పాటు దీక్షా స్వీకరణ చేయడంతో ఆధ్యాత్మికత భావం రెట్టింపు కావడంతో పాటుగా ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది.

ప్రశాంత జీవనం అలవడుతుంది..

ధర్మపురి శ్రీనివాస్ - (13వ పాదం) జనగామ



ఉరుకులు పరుగుల మధ్య బిజీబీజీగా కొనసాగుతున్న వర్తమాన పరిస్థితుల్లో కనీసం కుటుంబ సభ్యులతో తీరికగా గడపలేక పోతున్నాం. దీక్ష చేపట్టి మండలకాలం పాటు నిత్య పూజలు చేస్తూ ఆధ్యాత్మికతలో మునిగితేలుతుంటే ఎంతో హాయిగా ఉంటుంది. గత 13 ఏళ్లుగా దీక్షను చేపడుతూ ప్రతీ ఏటా అయ్యప్ప స్వామిని దర్శించుకుని వస్తుంటాను. మాలధారణ చేపట్టడంతో నాకు మానసిక ప్రశాంతతతో పాటు క్రమశిక్షణతో కూడిన జీవన విధానం అలవడుతోంది.



పాకాల ఆయకట్టులో తారిపోతున్న వరి పొలాలు

తారిపోతున్న వరి పొలాలు

- వరికోత యంత్రాల కొరత
- ఆందోళనలో పాకాల ఆయకట్టు రైతులు

ఖానాపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో కూలీల కొరత ప్రధాన సమస్యగా మారింది. సాగులో కూలీల కొరతను అధిగమించేందుకు ఆధునిక యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. రైతులకు గిట్టుబాటు కాకనో.. అవగాహన లేకనో.. ఇప్పటికీ ఆధునిక యంత్రాలను కొనుగోలు చేసుకోవడంలో వెనుక బడుతున్నారు. కూలీలు దొరక్క, ఆధునిక యంత్రాలు అందుబాటులో లేకపోవడంతో సాగు అదను దాటిపోవడం మూలంగా దిగుబడులు తగ్గి రైతులు నష్టపోతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే అత్యధిక విస్తీర్ణంలో వరి పంటను సాగు చేస్తూ అన్నపూర్ణగా పేరొందిన పాకాల ఆయకట్టులో రైతుల అవసరాలకు సరిపడా వరికోత యంత్రాలు అందుబాటులో లేకపోవడంతో కోత దశకు చేరుకున్న పంట తారిపోతోంది. పాకాల ఆయకట్టులో వానాకాలం సీజన్‌లో 30వేల ఎకరాల్లో వరిరి సాగు చేశారు. ఎక్కువ విస్తీర్ణంలో సన్న ధాన్యాన్ని సాగుచేశారు. దీంతో 80 శాతం పంట కోత దశకు చేరుకుంది. కూలీల కొరత కారణంగా రైతులు యంత్రాలపైనే(హార్వెస్టర్లు) ఆధారపడ్డారు. ప్రతి ఏటా ఇతర జిల్లాల నుంచి పెద్దఎత్తున పాకాల ఆయకట్టులోకి వరికోత యంత్రాలు వచ్చేవి. ఈ ఏడాది ఇప్పటివరకు రాకపోవడంతో పొలాలు తారిపోయి ఎటుచూసినా ఎండిపోయి దర్శనమిస్తున్నాయి. ఈ ఏడాది ఇప్పటికే వరుస తుఫాన్‌ల తాకిడి కారణంగా పంటలన్నీ దెబ్బతిని నేల వాలడంతో రైతులకు తీవ్రనష్టం వాటిల్లింది. కొద్దో గొప్పో పండిన పంటను నూర్పిడి చేసుకుందామంటే వరికోత యంత్రాలు లేక అవస్థలు పడుతున్నారు.

సాగు ముందుకు..

పాకాల ఆయకట్టులో ప్రతి ఏటా సాగు ఆలస్యంగా ప్రారంభమయ్యేది. దీంతో రైతులు స్టేట్ షెడ్యూల్‌కు నెల రోజుల వెనుకబడి ఉండేవారు. దీని కారణంగా యాసంగి సాగు సైతం ఆలస్యమయ్యేది. ఈ నేపథ్యంలో అధికారులు స్టేట్ షెడ్యూల్‌కు అనుగుణంగా పాకాల ఆయకట్టు రైతులు సాగు పనులు చేపట్టాలని అవగాహన కల్పించారు. ఈ ఏడాది వానాకాలంలో సాగు పనులను ముందుగా ప్రారంభించారు. గతంలో ఆయకట్టు రైతులు సాగు పనులను ఆలస్యంగా చేపట్టడంతో ఇతర జిల్లాల్లో వరికోతలు పూర్తి కాగానే వరికోత యంత్రాలు పాకాలకు వచ్చేవి. ఈ ఏడాది ఇతర జిల్లాల్లో సైతం ఇదే సమయంలో కోతలు నడుస్తుండడంతో పాకాల ఆయకట్టుకు వరికోత యంత్రాలు రాలేని పరిస్థితి దాపురించింది.

యంత్రాల కొనుగోలులో వెనుకబాటు

వరికోత యంత్రాల కొనుగోలులో పాకాల ఆయకట్టు రైతులు వెనుక బడిపోయారు. ఆయకట్టులో 30వేల ఎకరాల విస్తీర్ణంలో వరి పంట సాగైంది. పం ట నూర్పిడికి 80నుంచి 120 వరికోత యంత్రాలు అవసరమవుతాయని వ్యవసాయాధికారులు తెలిపారు. కానీ, ఆయకట్టు రైతుల చేతిలో 20 వరికోత యంత్రాలకు మించి లేవు. దీంతో సూర్యాపేట, నల్గొండ, కోదాడ, జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ వంటి ప్రాంతాల నుంచి ప్రతీ వానాకాలం సీజన్‌లో పాకాల ఆయకట్టుకు 100 నుంచి 120 వరికోత యంత్రాలు వస్తుంటాయి. ఒక్కో మిషన్ రోజుకు 8 నుంచి 10 ఎకరాల వరకు నూర్పిడి చేస్తుంది. దీంతో 20 రోజుల్లో కోతలు ముగిసేవి. ఈ వానాకాలం సీజన్‌లో ఇతర ప్రాంతాల నుంచి వరికోత యంత్రాలు రాకపోవడంతో ఇక్కడి రైతుల వద్ద వరికోత యంత్రాలు లేకపోవడం వలన పొలాలు తారిపోతున్నాయి. ప్రస్తుతం ప్రతీ రైతు యంత్రాల కోసం ఎదురుచూస్తున్నాడు. ఇతర ప్రాంతాల నుంచి పాకాల ఆయకట్టుకు వరికోత యంత్రాలు వస్తే మంచి గిరాకీ ఉంటుందని రైతులు అంటున్నారు. పాకాల ఆయకట్టు రైతులు సైతం రాబోయే రోజుల్లో అవసరాలకు సరిపడా వరికోత యంత్రాలను కొనుగోలు చేసుకోవాలని, తద్వారా సాగు అదను మించిపోకుండా చేసుకోవచ్చని అధికారులు సూచిస్తున్నారు.

బిషప్ జాన్‌మార్కండేయ సేవలు అభినందనీయం

- బ్రదర్ అనిల్‌కుమార్
- ముగిసిన ఆశీర్వాద పండుగలు

కాజీపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : బిషప్ జాన్ మార్కండేయ 40 ఏళ్లుగా పేదల కోసం, దైవ పరంగా చేసిన సేవలు అభినందనీయమని, ఆయనకు దేవుడి ఆశీర్వాదం నిత్యం ఉంటుందని బ్రదర్ అనిల్‌కుమార్ అన్నారు. కాజీపేట చౌరస్తా స్టేడియంలో మూడు రోజులుగా నిర్వహించిన ఆశీర్వాద పండుగలు సోమవారంతో ముగిశాయి. ఈ ఆశీర్వాద పండుగలకు ముఖ్య అతిథిగా బ్రదర్ అనిల్‌కుమార్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, హజ్ కమిటీ చైర్మన్, దర్గా పీఠాధిపతి ఖుస్రు పాషా హాజరై ప్రసంగించారు. పేదల కోసం నిత్యం సేవలందిస్తున్న బిషప్ జాన్ మార్కండేయకు ప్రభుత్వం పరంగా సహకారం అందిస్తుందన్నారు. అనంతరం బ్రదర్ అనిల్ పలు క్రైస్తవ గీతాలు ఆలపించారు. తన రాజకీయ గురువు వైఎస్ రాజశేఖర్ రెడ్డి అల్లుడు బ్రదర్ అనిల్ ఈ పండుగలకు రావడం ఎంతో సంతోషంగా ఉందని ఎమ్మెల్యే నాయిని అన్నారు. క్రైస్తవులంతా కాంగ్రెస్ వైపే ఉంటారన్నారు. ఈ పండగలకు వేలాదిగా హాజరైన క్రైస్తవులను కలవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అనంతరం బిషప్ జాన్ మార్కండేయ దంపతులను గజమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మినిస్ట్రీ డైరెక్టర్ నిఖిల్ జాన్, రోజ్‌మేరీ, బైబిల్ మిషన్ వ్యవస్థాపకుడు జీవరత్నం, పాస్టర్‌లు చంద్రమౌళి, కృష్ణతోపాటు క్రైస్తవులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.



బ్రదర్ అనిల్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే నాయిని

మేడారంలో ఎస్పీ పర్యటన



మేడారంలో బైక్‌పై వెళ్తూ రహదారులను పరిశీలిస్తున్న ఎస్పీ



పోలీస్ మెస్ స్థలాల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

జాతర పరిసరాలు, రహదారుల పరిశీలన

తాడ్వాయి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తాడ్వాయి మండలం మేడారంలో ములుగు ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్ సోమవారం పర్యటించారు. కొత్తగా బదిలీపై వచ్చిన ఆయన మేడారం పరిసరాలు, రహదారులను పరిశీలించారు. ఇతర పోలీసు అధికారులతో కలిసి బైక్‌పై కలియ తిరిగారు. మహా జాతర నేపథ్యంలో భక్తులకు ఎదురయ్యే సమస్యలపై అధికారులతో చర్చించారు. 2026 మహా జాతరకు 3 కోట్ల మంది భక్తులు వస్తారని అధికారుల అంచనాలకు అనుగుణంగా భద్రత చర్యలు చేపట్టాలని సూచించారు. ఇందులో భాగంగా మేడారం పరిసరాలతో పాటుగా కాల్వపల్లి, బయ్యక్కపేట, నార్లాపూర్, కొత్తూరు, ఊరట్టం, కన్నెపల్లి తదితర గ్రామాల్లో పర్యటించారు. రోడ్ల విస్తరణ పనులు, మరమ్మతులు, పార్కింగ్ స్థలాలు, వంతెనలు, కాజ్‌వేలు, జాతరలో పోలీసుల అకామిడేషన్ స్థలాలు తదితర పరిశీలించారు. అనంతరం వనదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎస్పీ వెంట ఓఎస్డీ శివం ఉపాధ్యాయ, ఏటూరునాగారం ఏఎస్పీ మనన్ భట్, డీఎస్పీ రవీందర్, సీఐ దయాకర్, ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి ఉన్నారు.

పోలీస్ మెస్, అకామిడేషన్ స్థలాల గుర్తింపు

మేడారం మహా జాతరలో విధులు నిర్వహించే పోలీసు సిబ్బందికి మెస్ అండ్ అకామిడేషన్ కోసం ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మేడారం,కొత్తూరు, కన్నె పల్లి, నార్లాపూర్, వెంగళాపూర్, రెడ్డి గూడెం, ఊరట్టం గ్రామాల్లో పోలీస్ సిబ్బం ది 11 స్థలాలను గుర్తించారు.వాటిని చదు ను చేసి సిద్ధంగా ఉంచారు. ఈ స్థలాల్లో మహా జాతరలో వసతి, భోజనాల సౌకర్యా లు ఏర్పాటు చేయనున్నారు.

ప్రముఖుల ప్రత్యేక పూజలు

వనదేవతలను బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి భీమగాని యాదగిరితో పాటు పలువురు ఇతర ప్రముఖులు దర్శించుకున్నారు. పూలు,పండ్లు, పసుపు, కుంకుమ, చీర సారెలు, కొబ్బరికాయలు, ఎత్తు బంగారం(బెల్లం) సమర్పించారు. పూజారులు దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవార్ల ప్రసాదాలు అందించారు.

ఒక్క క్లిక్‌తో మీసేవ..

- వాట్సాప్‌లో సర్వీసులు ప్రారంభం
- పౌర సేవలు మరింత సులభతరం

తొర్రూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మీసేవ సర్వీసులు ప్రజలకు మరింత చేరువయ్యేందుకు ప్రభుత్వం పౌర సేవలను వాట్సాప్ ద్వారా అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ డిజిటల్ సేవలను ఈనెల 18వ తేదీన రాష్ట్ర ఐటీ మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఇకపై ఒక్క క్లిక్‌తో 20కి పైగా మీసేవ సర్వీసులు సులభంగా పొందవచ్చు. దీనికిగాను ప్రభుత్వం ఒక ప్రత్యేక వాట్సాప్ నంబర్‌ను ఏర్పాటు చేసింది. వాట్సాప్‌లో 8096958096 నంబర్‌కు హాయ్ అని మెసేజ్ చేస్తే వెంటనే రిప్లేలో మెనూ వస్తుంది. కావాల్సిన సేవలను ఎంచుకుని దరఖాస్తు చేసుకోవచ్చు. ఎప్పటికప్పుడు అప్‌డేట్‌తో పాటు ఆమోదం పొందిన సర్టిఫికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకునే సౌకర్యం కల్పించారు. విప్లవాత్మక మార్పులతో ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత సులభంగా వేగంగా అందుతాయని అధికారులు అంటున్నారు.

అప్లై.. డౌన్‌లోడ్..

అధికారిక నంబర్‌కు వాట్సాప్‌లో హాయ్ అని మెసేజ్ చేస్తే నమస్కారం. తెలంగాణ మీసేవకు స్వాగతం మీకు ఎలాంటి సేవలు కావాలంటూ రిప్లైలో అందుబాటులోకి వస్తుంది. అందులో మనం ఎంచుకున్న సేవలకు దరఖాస్తు పూరించి అవసరమైన డాక్యుమెంట్‌లు, ఫోటోలు స్కాన్ చేయాల్సి ఉంటుంది. సూచించిన యూపీఐ ద్వారా ఫీజును సురక్షితంగా చెల్లించుకోవచ్చు. ఆతర్వాత దరఖాస్తు స్టేటస్, అప్‌డేట్, అన్ని వాట్సాప్‌లోనే మెసేజ్ రూపంలో వస్తాయి. ఆన్‌లైన్‌లో అందిన దరఖాస్తులను అధికారులు ధృవీకరణ పత్రాలను పరిశీలించి అర్హత మేరకు డొంగల్ ద్వారా జారీ చేస్తారు. సర్టిఫికెట్ సిద్ధం కాగానే డౌన్‌లోడ్ లింక్ ఫోన్‌కు మెసేజ్ వస్తుంది. దానిని క్లిక్ చేసి డౌన్‌లోడ్ చేసి పీడీఎఫ్ రూపంలో సేవ్ చేసుకోవచ్చు. ఇదేకాక మరో 500 రకాల సేవలు వాట్సాప్ ద్వారా అందుబాటులోకి వస్తాయని ప్రస్తుతం సర్టిఫికెట్‌లు పొందడానికి అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

జీపీవోలు ఎక్కడ..?

- ప్రశ్నార్థకంగా మారిన జీపీవోల పనితీరు
- పేరుకే గ్రామ పాలన.. సేవలు ఎక్కడ..!
- గ్రామాల్లో జీపీవో ఎవరో తెలియని పరిస్థితి
- సర్టిఫికెట్ల కోసం మండల కేంద్రాలకే వస్తున్న ప్రజలు
- సాదాబైనామాల పనిలోనే ఉన్నారంటున్న అధికారులు

వర్ధన్నపేట రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం గ్రామ రెవెన్యూ అధికారి(వీఆర్‌వో) వ్యవస్థను తీసివేసి, వారిని ఇతర శాఖల్లోకి పంపించింది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మళ్లీ ఆ వ్యవస్థను పునరుద్ధరించి, కొత్తగా గ్రామ పాలన అధికారి (జీపీవో)గా నామకరణం చేశారు. ఈ ఏడాది సెప్టెంబరు మాసం నుంచి వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జీపీవోలు విధుల్లో చేరారు. గతంలో వీఆర్వోలు పనిచేసే పనులనే మళ్లీ అప్పగించి, గ్రామీణ స్థాయిలో ఉన్న ప్రజలకు చేరువలో ఉండేలా చేశారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు వెయ్యికి పైగా రెవెన్యూ గ్రామాలు ఉండగా, అన్ని చోట్ల జీపీవోలను నియమించారు. కానీ, జీపీవోల పనితీరు ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది. జీపీవోలు ఎలా ఉంటారో కూడా తెలియదని గ్రామాల ప్రజలు చెపుతుండడంతో విడ్డూరంగా మారింది.

జీపీవోల పనితీరుపై గందరగోళం

వీఆర్వో వ్యవస్థ ఉన్న సమయంలో గ్రామాల ప్రజలు నేరుగా వారి పనిపై వెళ్లేవారు. కానీ, ఇప్పుడు వచ్చిన జీపీవో వ్యవస్థలో ఏం పనులు చేసుకోవాలో అర్థం కావడంలేదని గందరగోళానికి గురవుతున్నారు. దీనికి తోడు జీపీవో గ్రామాల్లో కనిపించడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. దీంతో గ్రామాల్లో జరిగే పనుల కోసం ఇప్పటికీ మండల కేంద్రంలోని కార్యాలయానికి వస్తున్నారు. జీపీవోలు గ్రామీణస్థాయిలో ఉండే ప్రజలకు కులం, ఆదాయం, నివాసం, రేషన్ కార్డు, భూ సమస్యలు, భూ వివరాలు, కుటుంబ సభ్యుల ధృవీకరణ పత్రం, ఉపాధి సర్టిఫికెట్లు, నివాస ధ్రువీకరణ పత్రం, పేదరిక ధ్రువీకరణ, రెవెన్యూ కేసుల్లో సహకారం, ప్రభుత్వ ఆధీనంలో ఉన్న రెవెన్యూ వ్యవస్థలోని పనులన్నింటీని జీపీవో స్థాయి నుంచి చేయాల్సి ఉంటుంది.

కార్యాలయాల్లోనే జీపీవోలు

గ్రామ పాలన అధికారులు భూ భారతి కార్యక్రమంలోని సాదాబైనామాకు సంబంధించిన దరకాస్తులను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో గ్రామీణస్థాయిలో అందించాల్సిన పాలనకు పంగనామాలు పెట్టారనే ఆరోపణలు వస్తున్నాయి. గ్రామ పంచాయతీ కార్యాలయంలో అందుబాటులో ఉండాల్సిన అధికారులు కనిపించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజంతా కార్యాలయంలో కూర్చుంటే గ్రామ సమస్యలు ఎలా తెలుస్తాయని వాపోతున్నారు. సర్టిఫికెట్ల కోసం వారాల తరబడి తిగాల్సి వస్తోందని చెపుతున్నారు. జీపీవో ఎంత మంది ఏ గ్రామాల్లో ఎవరెవరు పనిచేస్తున్నారు? నెల వారీ సమీక్షలు లేకపోవడంతో రెండు నెలలు గడిచినా జీపీవో జాడ కనిపించడం లేదు. జీపీవో సంతకానికి గ్రామం నుంచి మండల కేంద్రంలోని కార్యాలయంలో వచ్చి అడగాల్సిన పరిస్థితి దాపరించింది.



వర్ధన్నపేట తహసీల్దార్ కార్యాలయంలో ఫైళ్లను చూస్తున్న జీపీవోలు

గ్రామ పాలనలో బాధ్యతలు లేకపోతే ఎలా..

గ్రామస్థాయి పాలన అంటే ప్రజలకు దగ్గరగా ఉండే పరిపాలన. అక్కడే అధికారుల హాజరుకాకపోతే, ఫీల్డ్ పరిశీలన లేకపోతే, ఫిర్యాదు పరిష్కారం లేకపోతే పాలన పేరు మాత్రమే మిగులుతుంది. జీపీవోల హాజరుతో మండల అధికారుల దృష్టి సన్నగిల్లినట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. రోజువారీ కాకున్నా, వారానికోసారైన సమీక్ష లేకపోవడంతో కొత్త జీపీవోలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. గ్రామానికి వారంలో కనీసం 3 రోజుల పాటు అందుబాటులో ఉండాలనే నిబంధన తుంగలో తొక్కారు. జీపీవోలు వచ్చినా కులం, ఆదాయం సర్టిఫికెట్ల జారీలో వారాల తరబడి తిరగాల్సి వస్తోంది. దీంతో న్యాయం కావాలంటూ ప్రజలు ప్రజాప్రతినిధులు, నాయకులు, మండల అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. జీపీవో సంతకం చేయనిదే పై అధికారుల టేబుల్ వరకు ఫైల్ కదలడం లేదు.

ఉన్నతాధికారుల నిర్లక్ష్యం..

జీపీవోల పనితీరు పట్ల ఉన్నతాధికారులు సైతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గ్రామాల్లో అందుబాటులో ఉండి ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కార మార్గాల పై అధికారులతో మాట్లాడాల్సిన జీపీవోలు కార్యాలయాల్లో సాదాబైనామా, భూ భారతి పేరుతో ఫైళ్లను ముందట వేసుకుని కూర్చుంటున్నారు. వీటిని గమనించాల్సిన తహసీల్దార్లు కుర్చీకే పరిమితమై కార్యాలయ వివిధ విభాగాల్లో ఏం జరుగుతుందో కనీసం చూడడం లేదు. వారి కార్యాలయాల్లో ఉన్న విభాగాల్లో పరిస్థితిని నేరుగా కూడా చూడకపోవడంతో, ఇక మండలంలోని ఆయా గ్రామాలపై ఎలాంటి శ్రద్ధ ఉంటుందని మాట్లాడుకుంటున్నారు. ప్రస్తుత ప్రభుత్వం తీసుకొచ్చిన జీపీవో వ్యవస్థను ప్రజల్లోకి తీసుకెళ్లి వారి విధులను గుర్తుచేస్తూ ప్రజల సమస్యలను ఏకరువు పెట్టడంతో, ఉన్నతాధికారులు కూడా నిర్లక్ష్యం వహిస్తే ప్రజలు మరింత ఆగ్రహం వ్యక్తం చేసే అవకాశం ఉంది.

మహిళల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

గూడూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మహిళల కళ్లల్లో ఆనందం చూడాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. గూడూరు మండల సమాఖ్య కార్యాలయంలో సోమవారం మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న కోటి మంది మహిళలకు ఇందిరమ్మ చీరలను అందిస్తున్నట్లు చెప్పారు. గతంలో మాదిరిగా కాకుండా నాణ్యమైన చీరలను అందించి మహిళల గౌరవాన్ని పెంచినట్లు చెప్పారు. మహబూబాబాద్ నియోజకవర్గంలో 4500 ఇందిరమ్మ ఇండ్లను కూడ మహిళల పేరుపై మంజూరు చేసినట్లు చెప్పారు. రేషన్‌కార్డులను సైతం వారి పేరుపైనే అందజేసి ఒక్కొక్క వ్యక్తికి ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళ సంఘాల ద్వారా ఆర్టీసీకి అద్దెబస్సులు ఇవ్వడం, పెట్రోల్ బంకుల నిర్వహణ, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, రైస్‌మిల్లుల ఏర్పాటు వంటి అనేక వ్యాపారాల్లో మహిళలకు అవకాశం కల్పించినట్లు చెప్పారు. సమావేశంలో తహసీల్దార్ నాగభవాని , ఎంపీడీవో సత్యనారాయణ, మండల సమాఖ్య కార్యవర్గం కాంగ్రెస్ నాయకులు వాంకుడోతు కొమ్మాలు, నరేష్‌రెడ్డి, చిట్టి వెంకటేశ్వర్లు, మాదాసు రమేష్, భిక్షపతి పాల్గొన్నారు.



గూడూరులో చీరల పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

● నెల్లికుదురు : మహిళల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ తెలిపారు మండల కేంద్రంలోని మండల మయూరి మాఖ్య కార్యాలయంలో సోమవారం చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉపయోగపడే సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించిందన్నారు. వచ్చే సర్పంచ్ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ చంద నరేష్, జినుగు మరియన్న ఏపీఎం నరేంద్ర కుమార్, మహిళా సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు

● ఇనుగుర్తి : ఇనుగుర్తి మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం ఇందిరా మహిళా శక్తి చీరలను మహిళలకు ఎంపీడీవో బండారు పార్థసారధి, కేసముద్రం సొసైటీ చైర్మన్ ధీకొండ వెంకన్న పంపిణీ చేశారు. సొసైటీ డైరెక్టర్ కొట్టం మహేందర్, ఏఎంసీ సభ్యుడు కొట్టం రాము, జీపీ కార్యదర్శి లక్ష్మికాంత్, చిన్నాల కట్టయ్య, గంజి రాజేందర్‌రెడ్డి, తమ్మడపల్లి కుమార్, నరేందర్, వెంకన్న పాల్గొన్నారు.



నెల్లికుదురులో మహిళలకు చీరెలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్

టీఎస్ యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



అజీజ్, శివప్రసాద్

డోర్నకల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) :టీఎస్ యూటీఎఫ్ నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎండీ.అబ్దుల్ అజీజ్, ప్రధాన కార్యదర్శిగా ఎం.శివప్రసాద్, ఉపాధ్యక్షులుగా రామకృష్ణ, అనిత, కోశాధికారిగా లక్ష్మిప్రసాద్, కార్యదర్శులుగా వరలక్ష్మి, శాంతకుమారి, బుచ్చయ్య, అజయ్ సింగ్, సీతారామా రావు, సందీప్, ఆడిట్ కమిటీ కన్వీనర్లుగా సీతారాములు, రాజు, జిల్లా ప్రతినిధులుగా వివేక్, సాహెబ్‌ఆలీ, శంకర్, సో మనబోయిన శ్రీనివాస్, సురేష్, కాంప్లెక్స్ కన్వీన ర్లుగా ఎస్‌కె. అమీన, అమినాబీ, సతీష్ ఎన్నికైనట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి మల్లారెడ్డి, జిల్లా అధ్యక్షులు మురళీకృష్ణ తెలిపారు.

స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

గూడూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తులు చేసుకోవాలని గూడూరు తహసీల్దార్ నాగభవాణి అన్నారు. గూడూరు మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల హెచ్ ఎంలు, ఉపాధ్యాయులు, వార్డెన్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ 5వ తరగతి నుంచి 8వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఎస్సీ విద్యార్థులకు సంవత్సరానికి రూ.1000, బాలికలకు రూ.1500, 9, 10 తరగతి చదువుతున్న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల డే స్కాలర్ విద్యార్థులకు రూ. 3500, హాస్టల్ విద్యార్థులకు రూ.7 వేలు రాష్ట్ర ప్రభుత్వం అందించనున్నట్లు చెప్పారు. ఆధార్, కుల ధృవీకరణపత్రం, బ్యాంకు అకౌంట్‌లు పాఠశాలకు కేటాయించిన లాగిన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంఈవో రవికుమార్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ దంపతుల వినూత్న నిరసన



జీపీ ఎదుట నిరసన తెలుపుతున్న మాజీ సర్పంచ్ దంపతులు

దంతాలపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు నేటికి బిల్లులు రాకపోవడంతో మండలంలోని బీరిశెట్టిగూడెం తాజా మాజీ సర్పంచ్ నెహ్రూనాయక్ దంపతులు జీపీ ఎదుట వినూత్న నిరసన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను సర్పంచుగా ఉన్న సమయంలో పల్లె ప్రకృతి వనానికి కంచె ఏర్పాటు, విద్యుత్ లైన్ ఏర్పాటు, బతుకమ్మ ఘాట్ వద్ద కరెంటు పనులు రూ.10లక్షలతో చేయించానన్నారు. నేటికి బిల్లులు రాకపోవడంతో అప్పుల బాధతో తీవ్ర మనస్తాపానికి గురయ్యానన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తనకు రావాల్సిన పెండింగ్ బిల్లును విడుదల చేయాలని ఆయన కోరారు. తాను తెచ్చిన అప్పులను పూడ్చకపోవడంతో అప్పులు ఇచ్చిన వారు ఇంటికి వచ్చి తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారన్నారు. తన సమస్య పరిష్కరించాలన్నారు.

బీసీలకు అన్యాయం చేస్తే సహించేది లేదు

గూడూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) :స్థానిక సంస్థల రిజర్వేషన్‌లలో బీసీలకు అన్యాయం చేస్తే సహించేది లేదని బీసీ జేఏసీ అడహక్ కమిటీ జిల్లా కన్వీనర్ వేముల వెంకన్న, మండల కన్వీనర్ కట్ల విష్ణు, జిల్లా నాయకులు ముంజాల రాజేందర్ అన్నారు. మహబూబాబాద్ జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్‌లలో బీసీలకు అన్యాయం జరిగిందని, తమకు వెంటనే న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పోకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బీసీ జేఏసీ నాయకులు నూకల సురేందర్, నూకల ఉపేందర్, నామాని సదానందం, ఆవుల అశోక్, ముంజాల యాకయ్య, వాడిక వెంకన్న, పోతరాజు రవి, వంగపల్ల మల్లేష్, మండల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

కురవి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) సీరోలు మండలం చింతపల్లి శివారు తండాలో మృతి చెందిన దీరావత్ హన్సీ కుటుంబసభ్యులను మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ సోమవారం పరామర్శించారు. మృతురాలి హన్సీకి నివాళులు అర్పించారు. ఆమె కుమారుడు దీరావత్ వీరన్నను ఓదార్చారు. ఆమె వెంట బోడ శ్రీను, భూక్య హత్తిరాం, డొంగల నర్సయ్య, మంగీలాల్, వీరన్న, జానీ ఉన్నారు. వీరన్నను పరామర్శించిన వారిలో వివిధ పార్టీల నాయకులు బండి వెంకట్‌రెడ్డి, గుగులోతు రవి, యానాల గంగాధర్‌రెడ్డి ఉన్నారు.

విద్యార్థులకు వాటర్ బాటిళ్ల పంపిణీ



అర్పనపల్లి పాఠశాలలో వాటర్ బాటిళ్లను పంపిణీ చేసిన నరేష్

కేసముద్రం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అర్పనపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం జనసేన పార్టీ గ్రామ అధ్యక్షుడు చిట్టి నరేష్ రూ.6వేల విలువైన వాటర్ బాటిళ్లను వంద మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. నరేష్ తన పుట్టినరోజు సందర్భంగా ఈ బాటిళ్లను ఇవ్వడం అభినందనీయమని కాంప్లెక్స్ హెచ్‌ఎం చంద్రశేఖర్ అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యా యులు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

కేజీకేఎస్ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

కేసముద్రం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేటలో ఈనెల 28న నిర్వహించే కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ మండలంలోని అర్పనపల్లిలో సోమవారం ఆ సంఘం మండల అధ్యక్షుడు బబ్బురు ఉప్పలయ్య ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉప్పలయ్య మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో 68 ఏళ్ల క్రితం ఏర్పడిన సంఘంలో ఎన్నో పోరాటాలు నిర్వహించి, గీతకార్మికుల హక్కులను సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గంధం సంతోష్, గందసిరి వెంకన్న, స్వామి, యాకాంబ్రం, బబ్బురు వెంకటమల్లు, మోడెం రాజు, కామగోని సారయ్య, సాంబయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన కాంగ్రెస్ నాయకులు



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కొత్తగూడ కాంగ్రెస్ నాయకులు

కొత్తగూడ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నూతనంగా బాధ్యతలు చేపట్టిన మానుకోట ఎస్పీ శబరీష్‌ను మహబూబాబాద్‌లో సోమవారం కొత్తగూడ కాంగ్రెస్ నాయకులు కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలి పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య, డీసీసీ ప్రధాన కార్యదర్శి బానోత్ రూప్‌సింగ్, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లెపు రంజిత్, గంగారం మండల పార్టీ అధ్యక్షుడు జాడి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అనంతరం డీసీసీ అధ్యక్షురాలిగా ఎన్నికైన భూక్య ఉమను కాంగ్రెస్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

బీటీ రోడ్డు పనులను ప్రారంభించాలి

గార్ల నవంబరు 24 (ఆంధ్ర జ్యోతి) : మండలంపరిధిలోని బంజర తండా నుంచి గార్ల వరకు బీటీ రోడ్డు పనులను తక్షణమే ప్రారంభించాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్ నాయక్ అన్నారు. సోమవారం గార్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద అఖిలపక్ష రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో గంట పాటు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న రోడ్లను చెదర గొట్టి నూతనంగా రోడ్లును నిర్మించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం 10 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. రోడ్లపై కంకర పోయడంతో వాహనదారులు రాత్రి సమయంలో వాహనదారులు కిందపడుతున్నారని తెలిపారు. దీన్ని అధికారులు చూసీ చూడనట్లు వ్యవరించడంతో అనేక మంది ప్రాణాలు పోయే ప్రమాదం ఉదన్నారు. కందునూరి శ్రీనివాస్, ముంగి రాములు, జిసక్రు, కత్తి సత్యమయ్య గౌడ్, జడ సత్యనారాయణ, జంపాల వెంకన్న కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఆందోళన చేపడుతున్న అఖిలపక్ష నాయకులు

సంబరాలు కాదు.. ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

మాస్‌లైన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి

మహబూబాబాద్ రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి):ఆరు గ్యారంటీల హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వాటిని అమలుచేయకుండా సంబరాలు చేసుకోవడం ఏమిటని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి కూడా పూర్తి స్థాయిలో అమలుచేయలేదన్నారు. అకాల వర్షాలతో దెబ్బతిన్న పత్తి, వరి, మొక్కజొన్న, సోయా పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ అనిల్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పూనెం ప్రభాకర్, ముంజంపల్లి వీరన్న, ఉమ్మగాని సత్యం, జగన్న, కట్టయ్య, రాములు, ఎల్లయ్య, పాపయ్య, యాకయ్య, వెంకన్న, నవీన్, నాగలక్ష్మీ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఎదుట ఆందోళన చేస్తున్న కొత్తపల్లి రవి తదితరులు

సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ పట్టణ కార్యదర్శి నాగన్న

మహబూబాబాద్ టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మరిపెడలో ఈ నెల 28,29 తేదీల్లో జరుపతలపెట్టిన సీఐటీయూ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆసంఘం పట్టణ కార్యదర్శి కుమ్మరికుంట్ల నాగన్న పిలుపునిచ్చారు. మహబూబాబాద్ పట్టణంలో మునిసిపల్ కార్మికుల సమావేశాన్ని సోమవారం గడ్డం ఎల్లయ్య నిర్వహించారు. ఈ సందర్భంగా నాగన్న మాట్లాడుతూ మునిసిపాలిటీ కార్మికులు అనేక ఏళ్లుగా చాలీ చాలని వేతనంతో పని చేస్తున్నారని, నెలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా మహాసభలకు తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. కాంపెల్లి శ్రీనివాస్, గుర్రాల పుష్పరాజ్, తప్పెట్ల శ్రీకాంత్, దాసరి మనోహర్, ముత్తమ్మ, సైదులు, రాము, అంజయ్య, వెంకన్న, సుమన్, సురేష్, రాజు, మంజుల, పద్మపాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్ జీవో కాపీల దహనం

మహబూబాబాద్ రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి):కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌ల జీవో కాపీలను దహనం చేసినట్లు భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఇఫ్టూ) రాష్ట్ర కమిటీ సభ్యులు హెచ్. లింగన్న, జిల్లా అధ్యక్షుడు పర్వత కోటేష్ అన్నారు. మహబూ బాబాద్‌లోని వివేకానంద సెంటర్‌లో సోమవారం జీవో కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికులు సాధించుకున్న హక్కులపై కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌ల వలన తీవ్రనష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకు కార్మిక వర్గం ఐక్యంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. జబ్బార్, కృష్ణ, మురళీ, బాలమల్లు, సురేష్, లింగన్న, శంకర్, గోపి, వీరన్న పాల్గొన్నారు.

కవి శ్రీనివాస్‌రెడ్డికి సాహితీ పురస్కారం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) :మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన కవి, శుభోదయం సాహిత్య సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ అధ్యక్షుడు సంకెపల్లి శ్రీనివాస్‌రెడ్డిని సాహితీ పురస్కారంతో ఘనంగా సన్మానించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విజయవాడలో ఈ నెల 21,22 తేదీల్లో మల్లెతీగ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సాంస్కృతిక ఉత్సవాల్లో శ్రీనివాస్‌రెడ్డి వినిపించిన అభినందన అనే కవితకు సాహితీ పురస్కారం లభించింది. సంస్థ అధ్యక్షుడు కలిమి, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీషాలు శ్రీనివాస్‌రెడ్డిని సాహితీ పురస్కారంతో ఘనంగా సన్మానించారు. శ్రీనివాస్‌రెడ్డికి సాహితీ పురస్కారం రావడంతో జిల్లాకు చెందిన కవులు హర్షం వ్యక్తం చేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి



తహసీల్దార్ రాఘవరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న రైతులు

డోర్నకల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ మండలం అమ్మపాలెంలో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని అమ్మపాలెంకు చెందిన రైతులు సోమవారం తహసీల్దార్ రాఘవరెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. అమ్మపాలెంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం వల్ల అమ్మపాలెం గ్రామ రైతులకు సౌకర్యంగా ఉంటుందని తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. రైతుల విన్నపాన్ని మన్నించిన తహసీల్దార్ ఉన్నతాధికారులతో మాట్లాడుతానని తెలిపారు. కార్యక్రమంలో వల్లభనేని రవికుమార్, రాంధేని నాగేశ్వర్‌రావు తదితరులుపాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేత

కురవి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మావోయిస్టులు సాయుధ పోరాటం వీడి జన జీవన స్రవంతిలో కలిసి ఎన్నికల్లో పాల్గొనాలని కురవి మండలం బలపాల గ్రామానికి చెందిన మాజీ నక్సలైట్ రొయ్యల నాగేశ్వర్‌రావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మూడు పేజీల వినతిపత్రాన్ని అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసిన అన ంతరం అందించారు. తాను లిబిపియావో మహదేవ్ ముఖర్జీ పార్టీలో రాష్ట్రస్థాయిలో పనిచేసి 1990లో సీఎం చెన్నారెడ్డి సమక్షంలో లొంగిపోయానని తెలిపారు. తనకు ముప్పాళ్ల లక్ష్మణ్‌రావు (గణపతి), నల్లా ఆదిరెడ్డి, సంతోష్‌రెడ్డిలతో పరిచయం ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా సాయుధ పోరాటానికి మనుగడ లేదని, మావోయిస్టులు పునరాలోచించి లొంగిపోయి ప్రజాపోరాటాల్లో మమేకం కావాలని తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



బాస్కెట్‌బాల్‌కు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం జానయ్య

కురవి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు గుండ్రాతిమడుగు పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం కె.జానయ్య, పీడీ కమల్‌కిశోర్ తెలిపారు. మహబూబాబాద్‌లో ఈ నెల 23న జరిగిన అండర్-17 బాలికల, బాలుర సెలక్షన్స్‌లో పాఠశాలకు చెందిన బి.కుమార్, బి.కావ్య, ఝాన్సీలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ నెల 25 నుంచి కరీంనగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని చెప్పారు. ఉపాధ్యాయులు జి.భద్రు, యాదగిరి, సురేష్, మహేష్, రమ, శ్రీధర్, రాంసింగ్, బాబు, శోభారాణిలు తదితరులు అభినందించారు.

డీసీసీ అధ్యక్షురాలు ఉమకు సన్మానం



డీసీసీ అధ్యక్షురాలు ఉమను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మహబూబాబాద్ టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు భూక్య ఉమా మురళీనాయక్‌ను కాంగ్రెస్ నేతలు ఘనంగా సన్మానించారు. ఇటీవల డీసీసీ అధ్యక్షురాలిగా నియామకమైన భూక్య ఉమాను జిల్లాలోని కాంగ్రెస్ నేతలు సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అందులో భాగంగా పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకులు డీసీసీ అధ్యక్షురాలు ఉమాను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్టీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ గుగులోతు వెంకట్‌నాయక్, పోతు రాజు రాజు, లింగాల వీరభద్రం, చెన్న సీతారాములు, సంపంగి రాంచంద్రు, ముంజాల రాజేందర్, తేజావత్ శంకర్, బోడ రాము, ఎస్కే.గఫూర్, అశోక్, దుర్గేష్, కొత్త యుగేంధర్‌రెడ్డి, రాంబాబు, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో డీసీసీ అధ్యక్షురాలు భూక్య ఉమాను సన్మానించారు . ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నేతలు అల్లం గణేష్, జీలుగుల భాస్కర్, తోట అఖిల్, కోదండపాణి, హరికృష్ణ, మహేందర్, ఎమ్డీ.సమీర్, భూక్య అరుణ్, ముఖేష్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్.. చేసేద్దాం

(5వ పేజీ తరువాయి)

మెదళ్లలో మెదిలే ఆలోచనలకు ప్రోత్సాహాన్ని ఇవ్వడమే ఇన్‌స్పైర్ కార్యక్రమ లక్ష్యం. సమాజాభివృద్ధికి భావితరాలకు ఉపయోగపడే ఆలోచనలను చిన్నారుల చురుకైన మెదళ్లలో ప్రేరేపించడం, సైన్స్ అధ్యయనం పట్ల ఆసక్తిని పెంపొందించడం ఇన్‌స్పైర్ ప్రధాన లక్ష్యాలు కేంద్ర ప్రభుత్వం 2008లో ఈ పథకాన్ని ప్రారంభించింది. ఆరో తరగతి నుంచి డిగ్రీ వరకు విద్యార్థుల కోసం మూడు పథకాల ద్వారా ఐదు రకాల ప్రోగ్రాంలను అమలు చేస్తోంది.

ఇన్‌స్పైర్ అంటే 'ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ పర్స్యూట్ ఫర్ ఇన్‌స్పైర్డ్ రీసెర్చ్'.. ఇది బేసిక్ నేచురల్ సైన్స్‌లకు సంబంధించి విద్యార్థుల్లో అభిరుచిని పెంపొందింపచేయడానికి సామర్థ్యాలను వృద్ధి చేయించడానికి డీఎస్టీ ప్రారంభించిన కార్యక్రమమే ఇన్‌స్పైర్. ఇది అమలు చేసే మూడు పథకాల్లో మొదటి స్కీం ఫర్ ఎర్లీ అట్రాక్షన్ ఆఫ్ టాలెంట్ ఫర్ సైన్స్ (ఎస్‌ఈఏఈటీఎస్) ఇందులో రెండు ఉప కార్యక్రమాలు ఉన్నాయి. అవి ఇన్‌స్పైర్ అవార్డు-మనక్, ఇన్‌స్పైర్ ఇంటర్న్‌షిప్, రెండోది స్కాలర్‌షిప్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ (ఎస్‌హెచ్‌ఈ). మూడోది అస్యూర్డ్ ఆపర్చునిటీ ఫర్ రిసెర్చ్ కెరియర్ (ఏఓఆర్‌సీ). ప్రస్తుతం పాఠశాలస్థాయి విద్యార్థుల కోసం మనక్ ప్రోగ్రాంకి ప్రకటన విడుదలైంది.

మానక్ ఎవరికోసం...

ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల కోసం ఇన్‌స్పైర్-మనక్ (మిలియన్ మైండ్స్ ఆగ్‌మెంటింగ్ నేషనల్ యాస్పిరేషన్ అండ్ నాలెడ్జ్) ప్రోగాం రూపొందించారు. అంటే... ఆరవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న 10 నుంచి 17 సంవత్సరాల వయస్సు ఉన్న బాలబాలికలు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు. తద్వారా లక్ష మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుంది. తమ చుట్టు ప్రక్కల పరిస్థితులు వాతావరణంలో ఎదురయ్యే రకరకాల సామాజిక సమస్యలకు విద్యార్థుల చురుకైన మెదళ్లలో మెదిలే పరిష్కారాలను వెలికితీయడమే మనక్ లక్ష్యం.

దేశవ్యాప్తంగా లక్ష అవార్డులు..

దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది బడుల నుంచి 10 లక్షల ఆలోచనలను సేకరించి అందులో ఉత్తమమైన లక్ష పరిష్కారాలను ఎంపిక చేస్తారు. వీటిని సూచించిన లక్ష మంది విద్యార్థులు జిల్లాస్థాయిలో జరిగే సైన్స్ ఎగ్జిబిషన్‌లలో పాల్గొనడానికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున అవార్డులను ప్రభుత్వం అందిస్తోంది. దీంతో విద్యార్థులు తమ ఆలోచనలకు నమూనాలను తయారు చేసి సదరు ఎగ్జిబిషన్‌లతో హాజరు కానున్నారు.. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో జిల్లాస్థాయిలో జరిగిన పోటీల నుంచి 10 వేల ఉత్తమ ఆలోచనలను గుర్తిస్తారు. వాటిని అందించిన విద్యార్థులు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడానికి నమూనాలను తయారు చేయాల్సి ఉంటుంది. ఇందుకు అవసరమైన సాయాన్ని అందించేందుకు ప్రతీ విద్యార్థికి ఒక మెంటర్‌ను నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్-ఇండియా (ఎన్‌ఐఎఫ్) ఇతర ప్రముఖ టెక్నాలజీ సంస్థలు ఏర్పాటు చేస్తాయి. ఆపై జాతీయ స్థాయిలో అంతిమంగా ఎంపికైన 60 ప్రాజెక్టులు రాష్ట్రపతి భవన్‌లో జరిగే వార్షికోత్సవ ఉత్సవాల్లో ప్రదర్శించబడుతాయి. ఇందులో పాల్గొన్న ప్రతీ విద్యార్థికి రూ. 25 వేల చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో జమచేస్తారు.

మార్కెట్‌లో 'సద్దిమూట' అమలు

మహబూబాబాద్ అగ్రికల్చర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో తమ సరుకులను విక్రయి ంచేందుకు వచ్చిన రైతులు ఆర్థాకలితో అలమటించకుండా ఉండేందుకు సద్దిమూట కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ అన్నారు. మానుకోట వ్యవసాయ మార్కెట్ ఆవర ణలో సోమవారం రూ. 5 కే భోజనం సద్దిమూట పథకాన్ని చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల ఆకలి తీర్చే సద్ది మూట కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్ర మంలో మార్కెట్ కార్యదర్శి సుజన్‌బాబు, సూపర్‌వైజర్ రమేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

రుణ మార్పిడి పథకంపై అవగాహన ..

రైతులకు అధిక రుణభారానికి సంబంధించిన సమస్యలు ఉన్నట్లయితే జిల్లా న్యాయ సేవా అధికార సంస్థను సంప్రదించాలని మార్కెట్ చైర్మన్ సుధాకర్ అన్నారు. మానుకోట వ్యవసాయ మార్కెట్‌లో న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రుణమార్పిడిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది యాసాడి చెన్న మల్లారెడ్డి మాట్లాడుతూ.. రుణమార్పిడి పథకం ద్వారా రైతులు ప్రైవేటు దళారీల అధిక వడ్డీ రుణాల నుండి బయటపడే అవకాశం ఉందన్నారు. ప్రస్తుత రుణాలను తక్కువ వడ్డీతో ఉన్న బ్యాంకు రుణాల్లోకి మార్చుకోవడం రైతుల ఆర్థిక ఉపశమనం కలిగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి సుజన్‌బాబు, సూపర్ వైజర్ రమేష్, పులిగిల రవి తదితరులు పాల్గొన్నారు.



సద్దిమూట కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ సుధాకర్